
సాక్షి ఒడిశా

సోమవారం । 3 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,74,787లు, బంగారం 750 మిల్లీగ్రాములు, వెండి 36.4 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అధికారుల చర్యలపై విస్మయం

- 8లో



వన 'మహోత్సాహం'

- పర్యావరణ పరిరక్షణకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల చర్యలు

- 8లో

న్యూస్‌రీల్

రాయగడలో 'ఉక్కు మహిళ'



పద్మకు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

రాయగడ: విశాఖపట్నంలోని ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకింగా ఓ మహిళ ద్విచక్ర వాహనంపై చైతన్య యాత్రను కొనసాగించి శనివారం రాత్రి రాయగడకు చేరుకున్నారు. 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' నినాదాలతో వాహనంపై పోస్టర్లు, బ్యానర్లు అతికించి, తన డిమాండ్‌ను వ్యక్త పరుస్తున్నారు. విశాఖపట్నం ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం సభ్యురాలిగా ఉన్న జీవీఎల్ పద్మ స్కూటీపై రాయగడకు చేరుకోవడంతో స్థానిక ఐఎన్‌టీయూసీ సభ్యురాలు నంది గౌరీ, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా ఆమె కోరారు.

చోరీ సొత్తు రికవరీ

- ముగ్గురు దోపిడీ దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

బరంపురం: జిల్లాలోని గోపాల్‌పూర్ సమీపం ఆర్మీ కాలనీలో ఇటీవల జరిగిన దోపిడీ ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 230 గ్రాముల బంగారు ఆభరణాలు, 437 గ్రాముల వెండి సామగ్రిని రికవరీ చేశారు. దీనిపై ఐఐసీ అధికారి శారదాప్రసాద్ దాస్ తెలిపిన వివరాల ప్రకారం ఆర్మీ కాలనీలో నివాసం ఉంటున్న నీలమాధవ దాస్ ఇంట్లో కొద్దిరోజుల క్రితం చొరబడిన దుండగులు.. నగదు, ఆభరణాలతో పరారయ్యారు. దీనిపై బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వారు నేరం అంగీకరించడంతోపాటు చోరీ సొత్తును అప్పగించారు. నిందితులు గంజాం జిల్లాకు చెందిన చందన్ పాత్రో, సుధామ్ పాత్రో, ఉరుసు నాయక్‌గా గుర్తించారు.

కో–ఆపరేటివ్ కాంగ్రెస్‌కు కేసీసీబీ ప్రతినిధులు



అఖిల భారత కో–ఆపరేటివ్ కాంగ్రెస్ సమావేశంలో కేసీసీ బ్యాంక్ ప్రతినిధులు

కొరాపుట్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 17వ అఖిల భారత కో–ఆపరేటివ్ కాంగ్రెస్ సమావేశానికి కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రగతి మైదాన్‌లో కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఈ సమావేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 3,500 మంది ప్రతినిధులు పాల్గొనగా, కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి నేతృత్వంలో డైరెక్టర్లు రమాకాంత్ రాశొ(జయపురం), బి.తిరుపతిరావు, జగన్నాథ(రాయగడ), ఉదయ మాఝి, గోపి పంగి(మల్కన్‌గిరి), భీమొ హరిజన్, శ్యాంలాల్ పుంజార్(నవరంగ్‌పూర్) హాజరయ్యారు.

మహిళా సంఘాలతో కలెక్టర్ భేటీ



రాయఘడ బ్లాక్‌లో కుట్టు పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రధాన్

పర్లాకిమిడి: జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. ఇందులో భాగంగా రాయఘడ బ్లాక్‌లో మిషన్‌శక్తి కుట్టు పరిశ్రమ, శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. మహిళలు ఈ పరిశ్రమలో తయారు చేస్తున్న స్కూల్ యూనిఫాంను పరీక్షించారు. అనంతరం మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులతో మాట్లాడారు. అలాగే రంప పంచాయతీ దేవుళ గ్రామంలో 5టీ ట్రాన్స్‌ఫర్మేషన్ పాఠశాల భవనాలను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. పర్యటనలో గుసాని బీడీఓ నీలమాధవ మాఝి, పర్లాకిమిడి తహసీల్దార్ నారాయణ బెహరా, మిషన్‌శక్తి డీపీఓ మనస్మితా పాత్రో, బ్లాక్ ఇంజినీర్ నిహార్ నాయక్ పాల్గొన్నారు.

బొడొదండొలో భక్తజన సందోహం





బంగారు వన్నెలో బలభద్రుడు



శోభాయమానంగా దేవీ సుభద్ర



స్వర్ణ శోభితంగా జగన్నాథుడు

బంగారం.. పాణకం..

భక్తజన ప్రియుడు జగన్నాథుడు బంగారు శోభతో భక్త దర్బార్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా రాత్రంతా రథాలపై మూల విరాట్‌ల దర్శనం నిరవధికంగా లభించింది. సమయ పాలన ఇతరేతర కారణాలతో పరిమితం చేసిన ఈ దర్శనం నిడివిని అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించారు. బహుడా మరుసటి రోజు బంగారు శోభతో దర్శనమిచ్చిన స్వామి.. సకల దేవదేవతలతో దృశ్య, అదృశ్య శక్తులకు పాణకం సమర్పించి రథం దిగేందుకు సిద్ధమయ్యాడు. బహుడా సందర్భంగా గజపతి మహారాజా రాయబారంతో అమ్మవారు శాంతించిందనే గట్టి నమ్మకంతో నందిఘోష్ దిగి సరాసరి జయవిజయ ద్వారం దగ్గరకు చేరేసరికి ద్వారం మూతపడింది. జగమెరిగిన జగన్నాథుడు ప్రియసఖి మనసులో విరహ వేదన గుర్తించి, రసవంతమైన రసగుల్ల తినిపించడంతో తన్మయురాలైన మహాలక్ష్మి సాదరంగా స్వాగతించడంతో తీవిగా శ్రీమందిరం రత్న వేదికను అధిష్ఠించడంతో నీలాద్రి విజే మహోత్సవంతో ఈ ఏడాది జగన్నాథ రథయాత్రకు తెరపడింది. రత్న వేదికపై నిత్యదర్శనం, ఆనంద బజార్‌లో మహాప్రసాదం(ఒబొధా) లభ్యత యథాప్రకారం అందుబాటులోకి వచ్చాయి.

వేయి కన్నులతో..
వేచి చూస్తూ..

- దిగ్విజయంగా ముగిసిన పూరీ జగన్నాథుని రథయాత్ర
- ఆరంభంలో తడబడిన సేవాయత్‌లు, సేవల్లో అంతరాయం
- బహుడాలో సమన్వయంతో ముందే గమ్యాన్ని చేరిన రథాలు
- 40లక్షల మందికి పైగా భక్తుల హాజరు: పాలకవర్గం

ఈ ఏడాది పూరీ జగన్నాథుని వార్షిక రథయాత్ర దిగ్విజయమైంది. తనివి తీరా స్వామివారిని దర్శించుకున్న భక్తులు.. పునఃదర్శనాన్ని కాంక్షిస్తూ తిరుగు పయనమయ్యారు. కొన్ని ప్రత్యేకతలు, విమర్శలతో విశ్వవిఖ్యాత యాత్ర.. ఎన్నో విశేషాలను మూట గట్టుకుంది. ప్రారంభంలో విమర్శలు ఎదుర్కొన్న సేవాయత్‌ల తీరు.. మలిదశలో దీనిని అధిగమించారు. యాత్ర పూర్తి చేసుకొని, దేవతామూర్తులు తిరిగి రత్న వేదికకు చేరే సమయానికి సింహద్వారానికి వెండి తాపడం పనులు పూర్తయ్యాయి. దీంతో శ్రీమందిరం అదనపు హంగులతో ఆకర్షించింది. – భువనేశ్వర్

గుండిచాయాత్ర తొలిరోజు ప్రాతఃకాల సేవాదులతో రథాలు లాగేంత వరకు సకల కార్యక్రమాలు కొన్ని గంటల ముందే పూర్తయ్యాయి. ఈ క్రమంలో రథాలు లాగడం నిర్ధారిత సమయానికి ముందే ప్రారంభమైంది. చివరి క్షణంలో రథాలు గమ్యం చేరలేకపోవడంతో ఈ ఉత్సాహం నీరుగారిపోయింది. ఈ పరిస్థితి సర్వత్రా చర్చనీయాంశమైంది. సమగ్ర పరిశీలనలో సేవాయత్, పాలన, పోలీసు యంత్రాంగాల మధ్య సమన్వయ లోపం కారణమని తేలింది. లోటుపాట్లు సత్వర సంస్కరణతో బహుడా నుంచి చివరి వరకు జరిగిన ప్రతి కార్యక్రమం సకాలంలో పూర్తి కావడం విశేషం. బహుడా(మారు రథయాత్ర)లో నిర్ధారిత సమయం కంటే ముందుగా శ్రీమందిరం సింహద్వారం ఆవరణకు చేరాయి. స్వామి పట్ల చిత్త శుద్ధితో అనుబంధ వర్గాలు పొరపాటుని అంగీకరించి, తక్షణ సంస్కరణతో ముందుకు సాగడంతో ఇది సాధ్యమైంది. ఈ సందర్భంగా యాత్ర దిగ్విజయానికి సారథ్యం వహించిన అధికారులు, సిబ్బందికి శ్రీమందిరం పాలకవర్గం ఆదివారం ప్రత్యేకంగా సత్కరించి అభినందించింది. యాత్ర కార్యకలాపాల నిర్వహణ అడుగడుగున సవాల్‌గా నిలిచింది. రద్దీలో కిక్కిరిసిపోయే యాత్రికుల సంరక్షణ పట్ల ఈ ఏడాది ప్రత్యేక శ్రద్ధ వహించారు. సొమ్మసిల్లి పోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం, వడదెబ్బ నివారణ వంటి కార్యకలాపాల పట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంత సరంజామాతో యంత్రాంగం రంగంలోకి దిగినా, ఊపిరాడక యువతి మృతిచెందడం అపశృతిగా మిగిలి పోయింది. వడదెబ్బ నివారణ కోసం ఏర్పాటు చేసిన చన్నీటి సించనం జనంలో నలిగిపోయిన భక్త జనానికి తొలకరి జల్లులా ఉపశమనం కల్పించింది.



వెండి తాపడంతో సిద్ధమైన సింహద్వారం

మరణమే.. మోక్షం

జగతి నాథుడు అందరికీ ప్రీతిపాత్రుడు. ఆయన భక్తజనుల భగవంతుడుగా పేరొందాడు. ఏటా యాత్ర పురస్కరించుకుని స్వామి మూల విరాట్‌ని కనులారా తిలకించి కడ వరకు గుండెల్లో జగన్నాథుని నింపుకొని, భక్తజనం తిరిగి వెళ్తుంది. ఈ క్రమంలో జగన్నాథుని గుండిచా యాత్ర జననానికి సంకేతం, బహుడా కడతేరేందుకు మరికొంత మంది భావోద్వేగం. ఇటు రథాలపై అటు గుండిచా అడప మండపంపై మూల విరాట్‌లను దర్శించుకోవడం జన్మ తరించి పోయిందనే సంతృప్తి వాస్తవంగా తారసపడింది. ఈ ఏడాది స్నానోత్సవం పురస్కరించుకుని శ్రీమందిరం ప్రాంగణం మేఘనాథ్ ప్రహరి ఆవరణలో స్నాన వేదికపై మూల విరాట్‌లను దర్శించుకున్న కాసేపటికే యాత్రికుడు కుప్ప కూలిపోయాడు. అలాగే గుండిచా అడప మండపంపై కనులారా దేవతామూర్తులను దర్శించుకున్న తన్మయం నుంచి తేలుకోక ముందే నక్కాచౌణ ద్వారం పరిసరాల్లో మరో విరామ ఉపాధ్యాయుడు నేలకొరిగాడు. స్థానిక పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రికి హుటాహుటినా తరలించగా తుదిశ్వాస విడిచారని వైద్యులు ప్రకటించారు. ఈ రెండూ సహజ మరణాలుగా పరిగణించారు. యాత్రపరంగా తప్పిదంతో మృత్యు ఘటనకు బీమా పరిహారం లభించనుంది.

వెండి వెలుగులు..

స్వామియాత్ర ఆషామాషీ కాదు. భక్తులతో పాటు స్వామి కూడా ఉరకలేసుకుంటూ వీరి మధ్య ప్రత్యక్షం కావడం విశిష్టత. యాత్ర ముందు రోజు వరకు అస్వస్థత ఉపచారాలు పొంది కోలుకున్న మర్నాటి నుంచి స్వామి బొనాకొ లగ్గి సేవతో తళుక్కుమని నవ యవ్వనుడిగా ప్రత్యక్షమై నేత్రోత్సవంతో భక్తజనం అక్కున చేరాడు. యాత్ర కార్యకలాపాల్లో సమయ పాలన నేపథ్యంలో ఈ ఏడాది నవయవ్వన దర్శనం పరమాణిక్, సర్వ దర్శనం నిడివిని పరిమితం చేశారు. ఈ మేరకు ఉత్సాహంతో రథమెక్కి, స్వామి గుండిచాకు ఏగడంతో శ్రీమందిరం బోసిపోయింది. ఈ నిస్పృహ మర్నాటికి కనుమరుగైంది. నవ దినాత్మక యాత్ర ముగించుకుని విచ్చేసే స్వామికి శ్రీమందిరం సరికొత్తగా స్వాగతం పలికేందుకు సమాయత్తమైంది. సింహద్వారం వాకిలికి గుండిచా నుంచి 3 రథాలు చేరే సరికి ఆలయం లోపల, సింహద్వారం వెండి తాపడంతో జిగేల్ మన్నాయి. ముంబైకి చెందిన ఓ భక్తుని విరాళంతో ఈ పనులు చేపట్టారు.

ఒబొధా అద్వితీయం..


జ్యేష్ఠ పూర్ణిమ నుంచి స్వామి భక్తులకు శ్రీమందిరం ఆనంద బజార్ ప్రాంగణంలో మహాప్రసాదం కరువైంది. పత్యపు నైవేద్యాలతో స్వామి కాలక్షేపం చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. స్వామి కోలుకుని గుండిచాకు చేరేంత వరకు సుమారు 16రోజులు మహాప్రసాదం ఘుమఘుమలు జాడ లేకుండా పోయింది. గుండిచా ఆలయంలో స్వామి ఆసీనం కావడంతో అడపా ఒబొధా లభించింది. మహాప్రసాదం లభించని వ్యవధిలో బ్రహ్మగిరి అలార్‌నాథ్ దేవస్థానంలో ఖీరీ ప్రసాదం భక్తులకు లభించి ఊరట కలిగించింది.

రేయి, పగలు రథాలపైనే..

స్వామి యాత్రలో ఏదీ తప్పిదం కాదు. గుండిచా యాత్రలో సకాలంలో రథాలు గమ్యం చేరలేకపోయాయి. దీంతో బలభద్రుని తాళధ్వజం మినహా దేవీసుభద్ర రథం దర్పదళనం, జగన్నాథుని నందిఘోష్ రథం నడి దారిలో ఆగిపోయాయి. మర్నాటి సాయంత్రం వరకు రథాలపైనే నిత్య సేవాదులతో యాత్ర సేవలు నిర్వహించారు. సాయంత్రానికి గుండిచా ఆవరణకు 3 రథాలు చేరినా మూడో రోజు మధ్యాహ్నం వరకు అక్కడే భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గుండిచా అడపా మండపానికి తరలించారు. దీంతో శ్రీమందిరం సింహద్వారం నుంచి గుండిచా శారదాబాలి ప్రాంగణం వరకు దారి పొడవునా బొడొదండొ రేయింబవళ్లు ఒకే తరహాలో కిటకిటలాడింది.

భక్తజన సందోహం..

రథాయాత్రలో దాదాపు 10లక్షల మంది, హీరా పంచమిలో 3లక్షలు, సంధ్యా దర్శనం 3 లక్షలు, బహుడా 6లక్షలు, సొనాబెసొ 13లక్షలకు పైగా, అధర పొణొలో 2లక్షలు, నీలాద్రివిజే 3 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యారని పాలక వర్గం అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన సుమారు 40లక్షల మంది స్వామి వార్షికయాత్రలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని ప్రకటించారు.





శనివారం రాత్రి సింహద్వారం ముంగిట జగన్నాథుడు



యాత్రపై సమీక్ష నిర్వహిస్తున్న పాలకవర్గం

మృతుల కుటుంబాలకు పరామర్శ



బెంగాలీ శరణార్థులు గ్రామంలో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర



చెరువు ప్రమాద మృతులను పరామర్శిస్తున్న కొరాపుట్ ఎమ్మెల్యే పొడాల్

కొరాపుట్: ఇటీవల చోటు చేసుకున్న వివిధ ఘటనల్లో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రముఖులు ఆదివారం పరామర్శించారు. కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి కొంతన గ్రామంలో చెరువులో పడి మృతిచెందిన కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే రఘురాం పొడాల్ ఓదార్చారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోగా, ఆర్థికసాయం అందించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు నవరంగ్‌పూర్ జిల్లా వంచల గ్రామానికి చెందిన ముగ్గురు బెంగాలీ శరణార్థులు కారు ప్రమాదంలో మృతిచెందగా, ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, ఉమ్మర్‌కోట్ మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండొ ఆ గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు.

అర్హులకు దూరంగా 'కాలియా'

- ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.6 వేల వరకు సాయం అందిస్తుండగా.. రాష్ట్రంప్రభుత్వం అమలు చేస్తోన్న కాలియా పథకం అర్హులకు అందడం లేదని పర్లాకిమిడి ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు విమర్శించారు. బీజేడీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అధికారుల నుంచి నాయకుల వరకు ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లాలోని గుసాని సమితి ఉప్పలాడ, గారబంద గ్రామాల్లో బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందే ప్రతి బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్న కారణంగానే గుణుపురం నుంచి భువనేశ్వర్, కటక్ వరకు నాలుగు రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. తెరువలి వరకు రైల్వే లైన్ పొడిగిస్తే వందలాది మందికి ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో పార్టీ గారబంద మండల అధ్యక్షుడు కె.వేణు, ఉప్పలాడ అధ్యక్షుడు గేదెల శ్రీధరనాయుడు, కాశీనగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఛిత్రి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఎమ్మెల్యే నారాయణరావు, నాయకులు

క్లుప్తంగా

సైన్స్ అవార్డులను పునరుద్ధరించాలి

• జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ డిమాండ్



సైన్ వాక్ ర్యాలీ పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

విజయనగరం అర్బన్: శాస్త్ర విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పట్ల ప్రభుత్వానికి చిన్న చూపు తగదని రద్దు చేసిన సైన్స్ అవార్డులను పునరుద్ధరించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సైన్స్ వాక్ ర్యాలీ జరిగింది. గురజాడ గృహం నుంచి మూడు లాంతర్ల జంక్షన్ గంటస్తంభం మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలిపివేయాలని శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రకటించడం సాంకేతిక అభివృద్ధి తిరోగమనానికి దారి తీస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు ఇవ్వడానికి ఉద్దేశించిన 72 అవార్డులను రద్దు చేయడంతో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా కూడా 20 పైగా అవార్డులను పక్కకు పెట్టిందని విమర్శించారు. అవార్డులను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, వివిధ సంఘాల ప్రతినిధులు చీకటి దివాకర్, డి.రాము, రమేష్ పట్నాయక్, ఆర్.విజయ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, కె.శశిధర్, వెంకటేష్, సురేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చోరీపై డీఎస్పీ ఆరా



డీఎస్పీకి చోరీ ఘటనను వివరిస్తున్న బాధితురాలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బొబ్బిలి రోడ్డులోని వరలక్ష్మినగర్‌లో గత నెల 30న రాత్రి జరిగిన చోరీలో 14 తులాల బంగారం, ఒక ఐఫోన్ పోయిన ఘటనకు సంబంధించి చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాసచక్రవర్తి సంఘటనా స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. చోరీ జరిగిన తీరుపై బాధితులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నామ న్నారు. దర్యాప్తు వేగవంతం చేసి నేరానికి పాల్పడిన వారిని పట్టుకుంటామని వెల్లడించారు. రాత్రి సమయాల్లో అన్ని ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని రాజాం పోలీసులకు సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, దూరప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయనతోపాటు రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్సై వై.రవికిరణ్ తదితరులు ఉన్నారు.

పిడుగుపడి ఆవు మృతి

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో ఆదివారం సాయంత్రం మేతకు వెళ్లి వస్తున్న ఆవుపై గ్రామసమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వీఆర్వో పి.సింహాచలం తెలిపారు. గ్రామానికి చెందిన మహిళా రైతు కొల్లి సత్యవతి ఆవు (రూ.50వేల విలువ) మృతి చెందిన విషయాన్ని తహసీల్దార్, గురుమూర్తి, పశువైద్యాధికారికి సమాచారం అందించినట్లు వీఆర్వో తెలిపారు.

యజమానికి నమ్మక ద్రోహం

• ముగ్గురిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: నమ్మిన బంటుల్లా పనిచేస్తున్న ముగ్గురువ్యక్తులు ఓ కిరాణా షాపు యజమాని కళ్లుగప్పి షాపులో ఉన్న సామగ్రిని కొన్ని నెలలుగా చాటుగా అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 24న అదేరీతిలో వేరే వ్యక్తులకు సరుకు అమ్ముతుండగా సడన్‌గా యజమాని కుమారుడికి పట్టుబడ్డారు. దీంతో బాధిత యజమాని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పీడబ్ల్యూ మార్కెట్‌లో పంచదార, పప్పులు హోల్‌సేల్ అమ్మకాలు చేస్తున్న కె.సంతోష్ వద్ద పదేళ్లుగా కలాసీ, అకౌంటెంట్, కూలీగా పనిచేస్తున్న వారు యజమానిని మోసం చేశారు. ఈ నెల 24న మధ్యాహ్నం షాపులో ఉన్న పప్పులు, పంచదార వేరే వ్యక్తులకు అమ్ముతుండగా యజమాని సంతోష్ గమనించి నిలదీశాడు. ముగ్గురిని మార్కెట్ కమిటీ ముందుపెట్టి, రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. అయితే ఆ నష్టాన్ని ఇచ్చేస్తామని నిందితులు ముగ్గురూ ఒప్పుకున్నప్పటికీ డబ్బు ఇవ్వకపోవడంతో వేరేదారి లేక బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల చర్యలపై విస్మయం

• కాళీ మందిరాన్ని కూల్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నం
• అడ్డుకున్న స్థానికులు, కమిటీ ప్రతినిధులు



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన కమిటీ ప్రతినిధులు



మందిరం మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

రాయగడ: స్థానిక సమితి కార్యాలయానికి సమీపంలో గత 7ఏళ్లగా నిర్మిస్తూ తుది మెరుగులు పూర్తవ్వడంతో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రతిష్టాత్మకమైన కాళీ మందిరాన్ని కూల్చేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ విషయంలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ శనివారం ప్రమేయంపై వివాదం చెలరేగింది. కొద్ది రోజుల క్రితం మందిరం తలుపులు విరగ్గొట్టిన దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. అయితే జిల్లా పోలీస్ బాస్ నివాసానికి సమీపంలోనే ఈ మందిరం ఉండటం, చోరీ ఘటనపై పత్రికలు దుమ్మెత్తిపోసాయి. దీంతో అసౌకర్యానికి గురైన ఆయన.. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్‌ను కలిసి, దీనిపై(మందిరం) చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సిబ్బంది శనివారం మందిరం వద్దకు చేరుకొని, కూల్చివేతకు సంబంధించి కొలతలు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు.. వెంటనే అక్కడికి చేరుకొని, వాగ్వాదానికి దిగారు. దీంతో వెనుతిరిగిన సిబ్బంది విషయాన్ని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వెళ్లారు.

ఇప్పటికే రూ.1.27 కోట్ల వ్యయం..

ఇదిలా ఉండగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన మందిరాన్ని తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై మందిరం కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఆలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఎటువంటి ప్రతిఘటనలకైనా సిద్ధంగా ఉందామని తీర్మానించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ మందిరం అభివృద్ధికి సంబంధించి దాదాపు రూ.1.27 కోట్లు వెచ్చించామని తెలిపారు. త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో యంత్రాంగం ఈ విధమైన చర్యలు తీసుకోవడం విచారకరమన్నారు. మందిరాన్ని రక్షించుకునే క్రమంలో పట్టణ ప్రజలు ఎటువంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఇదే విషయమై జిల్లా ఎస్పీ వివేకానంద శర్మను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ధార్మిక సంస్థలకు చెందిన విషయంలో పోలీస్ యంత్రాంగం ఎటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోదని స్పష్టంచేశారు.

పాడుబడిన ఇంట్లో గంజాయి మూటలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, స్కూటీలు

జయపురం: పట్టణంలోని సదర్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఓ పాడుబడిన ఇంటిపై దాడి చేయగా, గంజాయి మూటలు బైటపడ్డాయి. దీనితో పాటు అక్కడే ఉన్న 2 స్కూటీలను స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారి ఈశ్వర తండి ఆదివారం వెల్లడించారు. 26వ నంబర్ జాతీయ రహదారి జయపురం-కొరాపుట్ మార్గంలో బరిణిపుట్ కూడలి వద్ద ఎస్ఐ రాజకిశోర్ బారిక్, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి అక్రమ నిల్వలపై సమాచారం అందింది. ఈ మేరకు ఒడిశా హైడ్రోపవర్ కార్పొరేషన్(ఓహెచ్‌పీసీ) హాస్టల్ వెనుక భాగంలో ఉన్న పాడుబడిన ఇంటిపై దాడి జరిపారు. అందులోని బస్తాలను పరిశీలించగా, గంజాయిని గుర్తించారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు.. సమీపంలోని అడవిలోకి పరారయ్యారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా, 60కిలోలు ఉన్నట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, గంజాయి, స్కూటీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన నిందితుల కోసం గాలిస్తున్నామని వివరించారు.

వంతెన నిర్మించాలని వినతి



సబ్ కలెక్టరేట్ వద్ద హరిరావు, గ్రామస్తులు

జయపురం: స్థానిక సమితిలోని కొంగ పంచాయతీతో ధొడ్రగుడ గ్రామాన్ని అనుసంధానం పరిచేందుకు వంతెన నిర్మించాలని గ్రామస్తులతో పాటు సామాజిక కార్యకర్త బి.హరిరావు కోరారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. ధొడ్రగుడ గ్రామం మీదుగా రోడ్డు నిర్మించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు టెండర్లు పలిచారని, అయితే అదే గ్రామంతో మరో 7పంచాయతీలను అనుసంధానం చేయాలంటే వంతెన నిర్మాణం ఎంతో అవసరమని స్పష్టంచేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

'రూల్స్ ఆఫ్ గ్రామర్'తో సులభంగా వ్యాకరణం



వ్యాకరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యార్థినులు

జయపురం: ఇంగ్లిష్ భాష, వ్యాకరణంపై పట్టు సాధించేందుకు 'రూల్స్ ఆఫ్ గ్రామర్' ఎంతో ఉపయుక్తంగా ఉందని బొరిగుమ్మ సమితి నువాగాం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎస్.రాజేష్‌కుమార్ రచించిన ఈ ఆంగ్ల వ్యాకరణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల వ్యాకరణం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించానని తెలిపారు. 6వ తరగతి నుంచి ప్లస్2 వారికి ఇది ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పుస్తకాన్ని భువనేశ్వర్ లోని ఎతినా పబ్లిషర్స్ ప్రచురించామని వివరించారు. రమేష్‌కుమార్ గతంలో ఇంగ్లిష్‌లో ప్రాథమిక వ్యాకరణం, టాక్ ఇన్ ఇంగ్లిష్ పుస్తకాలను రచించి, ప్రజలకు అంకితం చేశారని హెచ్ఎం రంజిత మౌశమీ భొత్ర అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస పండా, గుప్తేశ్వర రౌత్, అభిమణ్యు బెహరా, భాస్కరచంద్ర శత్పతి, రూపరంజన్ శబర, దివ్యజ్యోతి మల్లిక్, సుచిత్ర శామల్, శుభాషినీ సాహు, రస్మిత పండా, ఏఎస్ఎం రస్మిత స్వాయి, మ్యాట్రిన్లు జమా హరిజన్, సుభాష్ హరిజన్, భలి భూమియ తదితరులు పాల్గొన్నారు.

వన 'మహోత్సాహం'



పర్లాకిమిడి: బెత్తగుడ కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్



పర్లాకిమిడి: వన మహోత్సవంలో కలెక్టర్, ఎస్పీ స్వాతి, డీఎఫ్‌ఓ ఆనంద్

• పర్యావరణ పరిరక్షణకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల చర్యలు

జయపురం: వన మహోత్సవాల్లో భాగంగా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జయపురం సోషల్ ఎడ్యుకేషనల్, ఇన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసోసియేషన్(సీవా) ఆధ్వర్యంలో సమితి మాలిదొలైపుట్ గ్రామంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవా అధ్యక్షుడు సుధాకర పట్నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని 100మంది రైతులకు ఒక్కొక్కరికి 6మొక్కలు చొప్పున అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సీవా సభ్యులు వ్యవసాయ విభాగ వైజ్ఞానికులు జి.వెంకటరెడ్డి, కార్యదర్శి సౌమ్యరంజన్ దొలాయ్, సభ్యులు రంజిత నాయక్, అజయ మిశ్రా, ప్రతాప్ పట్నాయక్, కె.మోహనరావు, మురళీ పట్నాయక్, పిలు దాస్, బి.నలినీకుమార్, మురళీకృష్ణ పట్నాయక్, వినాయక మహాపాత్రొ, కె.కృష్ణరావు, మున్నా చౌధురి, రాజకిశోర్ మహంతి, పి.సోహన్, జి.శివ, రవీంద్రనాథ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ..

పర్లాకిమిడి: వన మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా బెత్తగుడ వద్ద జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఎఫ్ఓ ఎస్.ఆనంద్ పాల్గొన్నారు. రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు మొక్కలు అందిస్తున్న సీవా సభ్యులు

లోయలో పడిన ఆటో: ముగ్గురికి తీవ్రగాయాలు



జియ్యమ్మవలస/కురుపాం: ఆటో-కిందపడిన వ్యక్తులు

జియ్యమ్మవలస/కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం ఊసకొండ సమీపంలో ఘాట్‌రోడ్ వద్ద ఆదివారం బ్రేక్ ఫెయిలై అదుపుతప్పిన ఆటో లోయలో పడిపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే జియ్యమ్మవలస మండలం చినమేరంగి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా హాస్పటల్‌కు తరలించినట్లు చినమేరంగి వైద్య సిబ్బంది తెలిపారు. బలిజిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బెజ్జి ప్రసాద్ (35), వావిలాపల్లి కృష్ణ, (45), జయమ్మ (65)లు కురుపాం మండలం ధర్మలక్ష్మీపురం గ్రామానికి మద్యం మానిపించడానికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.



గరుగుబిల్లి: చికిత్స పొందుతున్న శంకరరావు

వ్యాన్ ఢీకొని ఒకరికి..

గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన ముషిడిపల్లి శంకరరావు శుభకార్యం నిమిత్తం ద్విచక్రవాహనంపై అడారి గ్రామానికి వెళ్లి తిరిగి తోటపల్లి వస్తుండగా నాగూరు పవర్‌స్టేషన్ సమీపంలో ఖడ్గవలసనుంచి వీరఘట్టంవైపు వస్తున్న లగేజీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరరావు ద్విచక్ర వాహనం పై నుంచి రోడ్డు పడిపోవడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనంద్వారా క్షతగాత్రుడిని చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్ ప్రమాదంలో మరొకరికి..

వంగర: మండల పరిధి మద్దివలస వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన ఉమామహేశ్వర రావు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

స్నేహితుల గొడవలో చాకుతో దాడి..



శృంగవరపుకోట: దాడిలో గాయపడిన బంగారయ్య

శృంగవరపుకోట: ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. శృంగవరపు కోటకు చెందిన కుక్కల అప్పయ్య, నోట్ల బంగారయ్య మంచి స్నేహితులు. వారిద్దరూ ధర్మవరం గ్రామంలో ఒక శుభ కార్యానికి హాజరయ్యేందుకు వెళ్లారు. ఇద్దరూ మద్యం తాగి శుభకార్యం జరిగిన ఒక గదిలోకి వెళ్లారు. వెళ్లిన కొంత సమయానికి బంగారయ్య తీవ్ర రక్తస్రావంతో బయటకు వచ్చాడు. అప్పయ్య చాకుతో వెనుకగా వచ్చాడు. స్థానికులు ఈఘటన చూసి రక్తస్రావంతో ఉన్న బంగారయ్యను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై తారకేశ్వరరావు ఘటనాస్థలానికి వెళ్లి ఆరా తీశారు. అనంతరం ఈ ఘటనపై కేసునమోదు చేశారు.

రైతులకు మిత్రలాభం..!

• చీడ పురుగులను నాశనం చేసే కీటకాలు
• ఏటా పెరుగుతున్న క్రిమిసంహారక మందులు
• మాయమైపోతున్న మేలు చేసే పురుగులు



రసాయన మందులను పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

పార్వతీపురం: రైతుల కష్టార్జితాన్ని తినేసే చీడ పురుగులను నాశనం చేసేందుకు మేలు చేసే పురుగులను కూడా ప్రకృతి సృష్టించింది. అందుకే వీటిని మిత్రపురుగులంటారు. ఒకప్పుడు ఇవి పంటలను ఆశించే తెగుళ్లను తినేస్తూ రైతుకు అండగా ఉండేవి. ఈ నేపథ్యంలో నాణ్యమైన, మేలైన ఉత్పత్తులు లభించేవి. కాని తెగుళ్ల నివారణకు రైతులు క్రిమిసంహారక మందులను విచక్షణా రహితంగా వాడడం మొదలు పెట్టాక మేలు చేసే మిత్ర పురుగులు కూడా అంతరించిపోతున్నాయి. పంటసాగులో నష్టపరిచే పురుగులతోపాటు వాటిని అదుపులో ఉంచే బదనికలు (చీడపురుగులను తినేవి), పరాన్న జీవులు (చీడ పురుగుల మీద జీవనం సాగించేవి) ఉన్నాయి. పంటలను ఆశించే చీడపురుగులు ఎక్కడ ఉంటే ఇవీ అక్కడే ఉంటాయి. వాటిని గుర్తించి కాపాడుకుంటే తెగుళ్ల రాకుండా పంటలను కాపాడతాయి.

లేడీ బర్డ్ బీటిల్స్ (అక్షింతల పురుగు)

ఎరుపు రెక్కలపై నల్లని మచ్చలతో అక్షింతల పురుగులుంటాయి. ఇవి లార్వా దశలో ఎక్కువగా పేనుబంక పురుగులను తిని జీవిస్తాయి. తల్లి పురుగులు సుమారు 300-400 సన్నటి పసుపు పచ్చని సూదులు లాంటి గుడ్లను ఆకుల అడుగు భాగంలో గుంపులుగా గుచ్చుతాయి. గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు 7-10 రోజుల వరకు, తల్లి పురుగులు 40-45 రోజులవరకు చీడ పురుగులను తింటూ జీవిస్తాయి.

ప్రేయింగ్ మేంటీ (గొల్లభామ)

ఒకప్పుడు కుప్పలు తెప్పలుగా కనబడే గొల్లభామలు ఇప్పుడు అక్కడక్కడా మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇవి కూడా రైతులకు బాగా ఉపయోగపడతాయి. దీన్ని ఇంగ్లీష్‌లో ప్రేయింగ్ మేంటీ అంటారు. ఇది పంటలను ఆశించే ఆకురసం పీల్చే పురుగులతోపాటు ఇతర చీడ పురుగులను తింటుంది.

ట్రయికోగౌమా (కందిరీగ)

పరాన్న జీవులకు సంబంధించిన ఈ కందిరీగ 200 రకాల చీడపురుగులను గుడ్ల దశలో ఆశిస్తాయి. తల్లి పురుగు 63-118 గుడ్లు పెడుతుంది. దీని జీవిత కాలం ఏడు, ఎనిమిది రోజుల్లో ముగుస్తుంది. ఏడాదికి 36 తరాలను వృద్ధి చేస్తుంది.

సాలీడు పురుగులు

సాలీడులు అనేక రకాల రంగుల్లో, ఆకృతులలో ఉంటాయి. తల్లి పురుగులు, పిల్ల పురుగులు కలిసి పేనుబంక, పచ్చదోమ, ఆకుముడత, ఎర్రనల్లి గుడ్లను తొలి దశలో ఉన్న లార్వాలను తింటాయి. తల్లి పురుగులు గుడ్ల సముదాయాన్ని ఆకుల పైభాగాన పెడతాయి. ఇవి తెల్లని గోధుమ రంగు పల్చటి పొరతో కప్పబడి ఉంటాయి. మొక్కలను కదిలించినప్పుడు చురుగ్గా కదులుతాయి.



అంక్షితల పురుగు



గొల్లభామ



కందిరీగ



సాలీడు పురుగు



రెక్కల పురుగు

జీవ నియంత్రణ పద్ధతే మేలు..



తెగుళ్ల నివారణకు జీవ నియంత్రణ పద్ధతి మేలు. పురుగు మందులను విచక్షణా రహితంగా వినియోగించడం వల్ల చీడపీడలు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నాయి. ఫలితంగా రైతులు ఇంకా భారీగా మందులు వాడాల్సి వస్తోంది. ఫలితంగా ఖర్చు ఎక్కువై దిగుబడి తగ్గి నష్టపోవాల్సి పరిస్థితి దాపురిస్తోంది. పంటలను ఆశించే తెగుళ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ రైతులకు మేలు చేసే మిత్ర పురుగుల పట్ల విద్యార్థులతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డా. బి.ప్రసన్నకుమార్,
అసోసియేట్ డీన్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానశాఖ కళాశాల, పార్వతీపురం

రెక్కల పురుగు

ఆకుపచ్చ రెక్కలుగల ఈపురుగు తూనీగలా ఉంటుంది. పొడవు 1.0-1.3 సెంమీ. వెడల్పు, 1-2 మీల్లీ మీటర్లు కళ్లు బంగారు రంగులో మెరుస్తుంటాయి. ఈ పురుగు ఆకుల అడుగు భాగాన లేదా మొక్క ఇతర భాగాల అడుగు భాగాన గుడ్లు పెండుతుంది. వాటినుంచి పిల్ల పురుగులు మూడు, నాలుగు రోజుల్లో బయటకు వస్తాయి. ఇవి మొదట తెల్లగా, ఆ తర్వాత గోధుమ రంగుకు మారతాయి. లార్వాదశలో మూడుసార్లు మార్పుచెంది 8-10 రోజుల్లో పెద్దవవుతాయి. ఈ పురుగులకు వాడిగా దంతాలు ఉండడం వల్ల చీడపురుగులపై దాడిచేసి తింటూ జీవిస్తాయి. ఇవి లార్వాదశలో పేనుబంక, తెలదోమ, పచ్చదోమ, తొలిదశలో ఉన్న శనగపచ్చ పురుగు, గొంగలి, పొగాకు లద్దె పురుగులను తినేస్తాయి.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళ నగదును అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ నిత్యాన్నదాన పథకానికి ఆమదాల వలస (తిమ్మాపురం)కు చెందిన బొడ్డేపల్లి వెంకునాయుడు తన భార్య తులసమ్మ జ్ఞాపకార్థం రూ.1,01,111 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలకు విరాళ నగదు అందించారు. దాతలకు పర్వదినాల్లో విశిష్ట దర్శనం కలిపిస్తామని, ఇందుకోసం ప్రత్యేక డోనర్ పాసులు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



తెరవే ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం 82వ నెలవారీ సాహితీ సమ్మేళనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐ ఎన్‌డీ ప్రసాద్ (దగాపడ్డ తమ్ముళ్లు), పి.వి. దుర్గాప్రసాద్ (అదే రహదారి), ఎం.శ్రీనివాస రావు (భారత స్వాతంత్ర్య స్ఫూర్తిదాతలు), యు.నాగేశ్వరరావు (అప్పులు తెచ్చిన తిప్పలు), టి.ఎర్రమ్మ (గరిమెళ్ల గర్జన), ఆర్.వి.రమణమూర్తి (ప్రజాకవి గరిమెళ్ల), కె.పేర్రాజు సిరికి స్వామినాయుడు మట్టి రంగు బొమ్మలు పుస్తక సమీక్ష, భోగెల ఉమాకవి (తల్లి నిన్నుతలచి), ఎస్.ఈశ్వరరావు(ఏమైపో తున్నాయో), పత్తి సుమతి (విప్లవ కారులు) కవితలను చదివారు.

పాన్‌షాపుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నరసన్నపేట: గంజాయి, ఇతర నిషేధిత వస్తువుల విక్రయాలు చేస్తున్నారనే అనుమానంతో నరసన్నపేటలోని పలు పాన్‌షాపుల్లో సీఐ డి.రాము, పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఆదివారపుపేట, దేశవానిపేట, వీరన్నాయుడు కాలనీతో పాటు పట్టణ శివారుల్లో షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత పదార్థాలు అక్రమంగా నిల్వ చేసినా, విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన పాసింజర్ రైలు



పాసింజర్ రైలులో రద్దీ

కాశీబుగ్గ: పలాస నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ రైలు ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసింది. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న గిరిప్రదక్షిణకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకావడంతో భోగీలన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి.

ఒక్క రోజులో రూ.4.60 లక్షల ఆదాయం

అరసవల్లి: అరసవల్లి సూర్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. భక్తులు ఉదయం 6 గంటల నుంచే క్షేత్రానికి చేరుకుని తలనీలాలను సమర్పించుకుని స్నానాలు చేసి స్వామికి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు. అనంతరం విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనాల మార్గాల్లో భక్తులు దర్శనాలకు వెళ్లారు. ఇంద్రపుష్కరిణిలో నీరు లేని కారణంగా ప్రత్యామ్నాయంగా స్నానాల వినియోగానికి కుళాయిలను అందుబాటులో తెచ్చారు. అలాగే ఈసారి కూడా ఈశాన్య గేటు నుంచి దర్శనాలకు వచ్చేలా చర్యలు చేపట్టడంతో చాలా వరకు ట్రాఫిక్ సమస్యలతో పాటు భక్తులకు కూడా ఏ దర్శనానికి వెళ్లాలో...ఏ పూజలు చేయించుకోవాలో స్పష్టమైన అవగాహన కలిగేలా ఏర్పాట్లు చేశారు. ఆలయానికి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన భక్తుల నుంచి దర్శనాల టిక్కెట్లు, పూజలు, విరాళాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.4,60,869 వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు. దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,16,800, విరాళాలు, ఆర్జిత పూజల ద్వారా రూ.69,069, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,75 లక్షల వరకు ఆదాయం లభించినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలకు చెక్!

- రైతులకు ఆసరాగా డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- ఎరువులు, విత్తనాల నాణ్యతను ముందుగానే తెలుసుకునే అవకాశం
- జిల్లాలో ఏడు సబ్ డివిజన్లలో ఏర్పాటు

అగ్రి ల్యాబ్‌లో ప్రైవేటు వ్యక్తులకు పరీక్ష రుసుములు ఇలా..

పరీక్షపేరు	చెల్లించాల్సిన ధర
విత్తనం మొలకశాతం	రూ.200
విత్తనం నాణ్యాత	రూ.50
విత్తనం తేమశాతం	రూ.50
ఎరువుల్లో ఒక పోషకం	రూ.1000
రెండో పోషకాలు	రూ.2000
మూడో పోషకాలు	రూ.2500
ఒక్కొక్క సూక్ష్మధాత పోషకు	రూ.750



రణస్థలంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

జి.సిగడాం: రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఏ ఒక్క రైతూ నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు వినియోగించి నష్టపోకూడదని భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సబ్ డివిజన్‌కు టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. అగ్రిటెస్టింగ్ ల్యాబ్ భవన నిర్మాణానికి రూ.60 లక్షలు, వాటిలో నాణ్యమైన పరికరాలు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.70లక్షలు చొప్పున వెచ్చించారు. మొత్తం రూ.కోటి 30 లక్షలు ఖర్చు చేశారు. ఈ ల్యాబ్ ద్వారా వివిధ రకాల విత్తనాల మొలక శాతం, తేమతోపాటు విత్తనాల నాణ్యతను తనిఖీ చేస్తారు. పశువులకు వచ్చే వ్యాధులపై తనిఖీ చేసేందుకు సేకరించిన నమూనాలను సైతం ఇక్కడ పరీక్షిస్తారు.

ఏడు సబ్ డివిజన్‌లలో ల్యాబ్‌లు

జిల్లాలోని రణస్థలం, శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, సోంపేట, పలాస, కొత్తూరులో డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో విత్తనాలు, ఎరువులు తనిఖీ చేయించుకుంటే సాగు చేస్తున్నప్పుడు రైతులకు ఎటువంటి సమస్యా ఎదురుకాదు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలే కాకుండా ప్రైవేటు షాపుల్లో కొనుగోలు చేసేవి, రైతులు సొంతంగా పండించుకునే విత్తనాలు, ప్రైవేటు డీలర్లు సైతం ఇక్కడ విత్తనాలను పరీక్షించుకునే సౌలభ్యం ఉటుంది. ఇందుకోసం కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది.



విత్తనాలను పరీక్షిస్తున్న అనలిస్ట్ సుహాసిని

రైతులకు ఉచితం



పంట సాగు చేసేందుకు రైతు తీసుకువచ్చిన విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షిస్తాం. ప్రయివేట్ డీలర్లు గాని స్వచ్ఛంద సంస్థల ద్వారా తీసుకుచ్చిన వాటిపై ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలి. తనిఖీ చేసిన ఫలితాలను 10 నుంచి 15 రోజుల్లో రైతుకు అందిస్తాం.

– వద్దాది శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఏడీఏ రణస్థలం

వినియోగించుకోవాలి



విత్తనాలు, ఎరువులు నాణ్యతా ప్రమాణాలు పరీక్ష చేయించుకోవాలనే రైతులు ఆర్‌బీకేలో పని చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బందిని కలవాలి. వారు ల్యాబ్ అనలిస్టలతో మాట్లాడి అవసరమై పరీక్షలు చేయిస్తారు. ఇటువంటి సేవలను రైతులు వినియోగించుకోవాలి.

– విజయభాస్కర్, మండల వ్యవసాయాధికారి, రణస్థలం

కచ్చితమైన ఫలితాలు



రైతులు తీసుకువచ్చిన విత్తనాలు, ఎరువుల్లో నాణ్యతా ప్రమాణాలు, తేమ, మొలక శాతం సమర్థంగా పరీక్షిస్తాం. దీనివల్ల రైతులు సాగు సమయంలో ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చు. రైతులు నమూనాలు అందజేసిన 10 –15 రోజుల్లో ఫలితాలను అందిస్తాం.

– జి.సుహాసిని, డాక్టర్ వైఎస్సార్ అగ్రిలాబ్ అనలిస్ట్ ఏఓ, రణస్థల

50 వేల ఎకరాల్లో యాంత్రీకరణ సాగు లక్ష్యం



యాంత్రీకరణ ద్వారా వెద సాగు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం : డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని 25 మండలాల్లో 50 వేల ఎకరాల్లో యాంత్రీకరణ పంటల సాగు చేయించడం లక్ష్యమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. ఆదివారం జి.సిగడాం మండలం పాలఖండ్యాం, సంతవురిటి, పెంట గ్రామాల్లో సుమారు 60 ఎకరాల పొలంలో యంత్రం సాయంతో వెదసాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపాతం తక్కువ కారణంగా యంత్ర సాగు ద్వారా వెద సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించగలమన్నారు. సాగునీరు కూడా ఆదా చేయవచ్చున్నారు. ఎకరాకు 12–13 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయని చెప్పారు. యంత్రాలను అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు 9985542547 నంబరుకు సంప్రదించాలన్నారు. 38 శాతం రాయితీపై యంత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ లక్ష్మీనరసింహమూర్తి, సమన్వయకర్త ఆకిరి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంజీఆర్ పుట్టినరోజు వేడుకలు



మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆదివారం తామర గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా నీలమణిదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా ఆస్పత్రి కూడలి, మార్కెట్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పైల బాబ్జీ, యాళ్ల నాగేశ్వరరావు, వెలమల గోవిందరావు, నంబాల వెంకటరమణ, ఎద్దు దాసునాయుడు, శంకరరావు తదితరులు పాల్గొన్నరు.

హౌస్ సర్జన్ ఆత్మహత్య

- పెనరపాడులో విషాదఛాయలు



చైతన్య మృతదేహం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 6వ వార్డు పెసరపాడు గ్రామానికి చెందిన పాలవలస చైతన్య(24) అనే హౌస్ సర్జన్ ఆదివారం నెల్లూరులో ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్య ఎంబీబీఎస్ పూర్తి చేసి నెల్లూరు జిల్లా నారాయణ మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తోంది. అదే కళాశాల వసతి గృహంలో నివాసముంటోంది. ఈమెకు ఈ ఏడాదిమార్చి 8న నందిగాం మండలం ప్రతాప విశ్వనాథపురం గ్రామానికి చెందిన బమ్మిడి శరత్‌కుమార్ అనే ఆర్థోపెడిక్ వైద్యునితో వివాహం జరిగింది. ఏం జరిగిందో ఏమో గానీ ఆదివారం తాను ఉంటున్న హాస్టల్ గదిలోనే చైతన్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ భర్త కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. కాగా, మృతురాలు తల్లి పాలవలస జ్యోతి వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. తండ్రి ఆర్మీలో ఉద్యోగం చేసి చిన్నతనంలో మృతి చెందారు. చైతన్య మృతదేహాన్ని సోమవారం పలాసకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

కాలువ ఆక్రమించి రైతులపై దాడులా?

- టీడీపీ నేతల తీరుపై వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాశీబుగ్గ: కాలువను ఆక్రమించి రైతులపై దాడులు చేయడం ఎంతవరకు సమంజమని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రశ్నించారు. ఆదివారం చినబడం బస్టాండ్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని రాజకీయాలు చేయాలన్నారు. ప్రాంతాలు, ప్రజల మధ్య గొడవలు పెట్టే రీతిలో టీడీపీ నాయకురాలు గౌతు శిరీష మాట్లాడటం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న కుటుంబం నుంచి వచ్చినా మంత్రిపై మాట్లాడుతున్న తీరును చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. టీడీపీ నేత బడ్డ నాగరాజు కాలువను ఆక్రమించుకుని రహదారి నిర్మించుకుంటే పంట పొలాలకు నీరు ఎలా వెళ్తుందో చెప్పాలని శిరీషను సూటిగా ప్రశ్నించారు. వాస్తవాలు గమనించలేని స్థితిలో ప్రతిపక్ష నాయకులు ఉన్నారని మండిపడ్డారు. ఇతర నియోజకవర్గం నుంచి నాయకులను రప్పించి పలాసలో అల్లర్లు సృష్టించాలని చూస్తే తీవ్రస్థాయిలో ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. శనివారం రాత్రి అధికారులు కల్వర్టు ఆక్రమణ తొలగించాలని వెళ్తే అధికారులను బెదిరించి చంపేస్తాం పాడిచేస్తాం అంటూ పిచ్చి ప్రేలాపన చేయడం తగదన్నారు. రైతుల ఆలోచనలు, ఆవేదనలు వేరేగా ఉంటాయని, వారి బాధలను అర్థం చేసుకుని మెలగాలని హితవుపలికారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, కౌన్సిలర్ దువ్వాడ రమణయ్య, డిక్కల నిరంజన్, అట్టా మోహనరావు, మాదిన వెంకటరావు, కూర్మాపు సుందరరావు, ధర్మారావు, డిక్కల లక్ష్మణరావు, బడగల బళ్లయ్య, అంబటి ఆనంద్, డబ్బీరు భవానీ, దుర్గా శంకర్‌పండా, బమ్మిడి సంతోష్, పప్పల ప్రసాద్, గౌరీత్యాడి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సామాజికవర్గానికి సముచిత గౌరవం



ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త సాయిరాజ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

కవిటి : అణగదొక్కబడిన తమ సామాజికవర్గానికి చెందిన బీసీ నేత నర్తు రామారావుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమ పట్ల చూపిన ఆదరణ యాదవసామాజిక వర్గానికి దక్కిన గౌరవమని వక్తలు కొనియాడారు. కవిటి మండలం జాడుపుడి ఆర్ఎస్‌లో జి.బెలగాం గ్రామస్తుల ఆధ్వర్యంలో మద్దిలి ఈశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నాలుగు మండలాల ప్రజాప్రతినిధులకు పౌరసన్మాన సభ నిర్వహించారు. ముందుగా రామారావు, సాయిరాజ్‌లను సత్కరించి జ్ఞాపికల్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెలగాం పంచాయతీ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య, డాక్టర్ కోదండరాం, కడియాల ప్రకాష్, ఏఎంసీ చైర్మన్లు బదకల మోహనరావు, ఎస్.బాబూరావు, వైస్ చైర్మన్ వై.నీలయ్య, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మడి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం



కోలాటం చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలో షిరిడిసాయి తత్త్వ ప్రచారం మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న గురు పౌర్ణమి వేడుకలలో భాగంగా ఆదివారం తిరువీధి ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురోహితులు భాస్కర భట్ల చంద్రశేఖరశర్మ, రాజేష్‌శర్మల ఆధ్వర్యంలో కోటిలిఖిత నామ జపం పుస్తకాలతో మేళతాళాలు, కోలాటంతో అత్యంత వైభవంగా కార్యక్రమం నిర్వహించారు.

9న 'మన కోసం మనసభ'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గుంటూరులో ఈ నెల 9న జరగనున్న మన కోసం మన సభను విజయవంతం చేయాలని శ్రీకాకుళం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కిల్లాన భోజ్‌కుమార్, సోషలిస్ట్ థింకర్స్ ఫోరమ్ రాష్ట్ర ప్రతినిధి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ(అహీర్) జిల్లా అధ్యక్షుడు గదిబోయిన కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చేతుల మీదుగా ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ, భారీ బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అహీర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి రాము యాదవ్, యాదవ సంఘం నాయకులు కిల్లాన శ్రీనివాసరావు, వంజరాపు రాజు, బత్తుల మురళీమోహన్, కెల్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నైవేద్యానికి నిధుల కేటాయింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి ధనుంజయాచారి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాల నిమిత్తం నెలకు రూ.5 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయాచారి అన్నారు. శ్రీకాకుళం కంపోస్టుకాలనీలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల్లో 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. వర్కింగ్ షెడ్ల నిర్మాణానికి సహకారం అందించాలని, దేవాలయ పాలక మండలి సభ్యుల్లో విశ్వ బ్రాహ్మణ సామాజికవర్గానికి కూడా చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు టేకి సూర్యకుమారి, సెక్రటరీ దేవరకొండ షణ్ముఖరావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మంతిన హరినాథరావు, గౌరవ అధ్యక్షుడు సింహాద్రి గోపాలకృష్ణ, నల్లబాటి కృష్ణ, అనుపోజు శ్రీధర్, అంట్లూరి గణ, పొన్నాడ రమణ పాల్గొన్నారు.

13న తలనీలాల వేలం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఈ నెల 13న మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ వేలం వేయనున్నామని ఈవో టి.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, దేవదాయశాఖ అధికారులు సమక్షంలో వేలం జరుగుతుందని, ఆసక్తి గల వారు రూ. 2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఐక్యపోరాటాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పి.ఓ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పి.కుసుమ

పలాస: దేశం, రాష్ట్రంలో ప్రజల కోసం గొంతుకలై మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులపై ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని, 152 మందిపై పెట్టిన ఉపా కేసులను ఉపసంహరించుకోవాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే ప్రభుత్వాల నిర్బంధాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పి.ఓ.డబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.కుసుమ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామ్రెడ్ సంధ్యకు మావోయిస్టు అనుబంధ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేసులు ఎత్తివేయాలని కోరారు. సమావేశంలో సి.పి.ఐ.ఎం. ఎల్. లిబరేషన్ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, పి.కె.ఎస్.జిల్లా అధ్యక్షుడు పుచ్చ దుర్యోధన, అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకుడు జోగి కోదండరావు, సి.పి.ఐ.ఎం.ఎల్. న్యూడెమోక్రసీ జిల్లా సహాయక కార్యదర్శి గొరకల బాలకృష్ణ, పి.డి.ఎం.జిల్లా కార్యదర్శి సాలిన వీరాస్వామి, తామాడ సన్యాసిరావు, నాగమణి, తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, కుత్తుం దుష్యంతు, ఢిల్లీరావు, కుత్తుం హేమ, ఆర్.మాధవరావు, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

8న కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న కరిమి రాజేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాందూరు అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, సీపీఎస్ కన్వీనర్ జి.నారాయణరావు, ఏపీటీఎఫ్ 257 నవీన్, రామ్మోహన్‌రావు, ఏపీటీఎఫ్ 1938 టెంక చలపతిరావు, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి దానేటి కేశవ, ఎస్ఎల్‌టీఏ అధ్యక్షుడు పి.వసంతరావు, ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.ధనుంజయరావు, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు చల్లా దుర్గాప్రసాద్, తూముల సూర్యారావు, ఎ.భాస్కర్, రెడ్డి సూరిబాబు, ఎండ ఉమా శంకర్, పురుషొత్తం, శరత్ పాల్గొన్నారు.

బస్ స్టేషన్లలో లీజుకు ఖాళీ స్థలాలు



ఆమదాలవలస బస్‌స్టేషన్ పరిధిలో లీజుకు ఇవ్వనున్న స్థలం

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోన్ పరిధిలో శ్రీకాకుళం జిల్లాలో వివిధ బస్‌స్టేషన్లలో 5 ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి విజయ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం బస్ కాంప్లెక్స్‌లో బిట్–1, 667 చదరపు గజాలు, బిట్ –2, 7839 చదరపు గజాలు, సోంపేట బస్ స్టేషన్ పరిధిలో 774 చదరపు గజాలు, టెక్కలి బస్ స్టేషన్ పరిధిలో 17908 చదరపు గజాలు, ఆమదాలవలస పాత బస్‌స్టేషన్ పరిధిలో 9680 చదరపు గజాల ఖాళీ స్థలాలు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లు, స్థలాల వివరాలు వాటికి సంబంధించిన డ్రాయింగ్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు తెలిపారు. బిడ్ సంబంధిత డాక్యుమెంట్లు ఈనెల 5వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చునని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఔత్సాహిక వ్యాపారులు తమ బిడ్లు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వారి కార్యాలయం, జోనల్ వర్క్ షాప్, వీటీ అగ్రహారం, విజయనగరం వద్ద ఖరారు చేయవచ్చని తెలిపారు. వివరాలకు డిప్యూటీ ఈఈ, శ్రీకాకుళం ఫోన్ నంబరు 9346045369 కు సంప్రదించవచ్చునని తెలిపారు.